ఈనాడు శ్రీకాకుళం
గురువారం సెప్టెంబరు 26, 2024

నాణ్యతకు పాతరేశారు..
ఆశల దీపాన్ని ఆర్పేశారు..!

గత పాలకుల వైఫల్యం ఆ విద్యార్థుల పాలిట శాపంగా మారింది. పనులు మధ్యలో వదిలేయడంతో పాటు నాసిరకంగా చేపట్టడం వారి ప్రాణాలమీదకొచ్చింది. విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన చోటే ఓ బాలుడి ఊపిరాగిపోయింది. రెండు కాళ్లు విరిగి మరొకరిని ఆసుపత్రి పాల్జేసింది. రణస్థలం మండలం పాతర్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది..
– న్యూస్‌టుడే, ఎచ్చెర్ల (రణస్థలం), గుజరాతీపేట


కృష్ణంరాజు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

స్థానిక జడ్పీ పాఠశాలలో 'నాడు-నేడు'లో భాగంగా రెండేళ్ల కిందట వైకాపా హయాంలో ప్రారంభించి వదిలేసిన ఓ భవనం బాలుడి నిండు ప్రాణం తీసింది. గ్రామానికి చెందిన వనుం కృష్ణంరాజు(15), కోరాడ శ్రీరామ్ అనే ఇద్దరు విద్యార్థులు ఎప్పటిలాగే బడికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో విరామం ఇవ్వడంతో బయటకొచ్చారు. ఆవరణలో అసంపూర్తిగా నిలిచిన అదనపు నిర్మాణం వైపు వెళ్లారు. భవనం కిటికీ శ్లాబుపై ఆడుతుండగా ఒక్కసారిగా అది ఒరిగిపోవడంతో ఇద్దరూ కింద పడిపోయారు. ఆపై బీముతో సహా శ్లాబు కుప్పకూలి వారిపై పడింది. కృష్ణంరాజు తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన శ్రీరామ్‌ను శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. గాయపడిన విద్యార్థిని ఆసుపత్రిలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. జేఆర్‌పురం సీఐ అవతారం, ఎస్సై ఎస్.చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.


విద్యార్థుల మీద పడిన శ్లాబు


గాయపడిన శ్రీరామ్

ప్రమాదాలు జరగకుండా చూస్తాం..

వైకాపా హయాంలో అసంపూర్తిగా వదిలేసిన పాఠశాల భవనం కిటికీ శ్లాబ్ కూలి కృష్ణంరాజు అనే విద్యార్థి చనిపోవడం, మరో విద్యార్థి గాయపడటం బాధాకరం. పాఠశాలల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం, విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటాం. – నారా లోకేశ్, విద్యాశాఖ మంత్రి

బాలుడి మృతి బాధాకరం..

శ్లాబు కూలిన ఘటనలో బాలుడి మృతి బాధాకరం. ఈ ఘటన తీవ్రంగా కలచివేసింది. వైకాపా ప్రభుత్వం అసంపూర్తిగా భవనాలను వదిలేసింది. కృష్ణంరాజు కుటుంబానికి అండగా ఉంటాం. ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు పరిహారం అందిస్తాం.
– కె.అచ్చెన్నాయుడు, రాష్ట్ర మంత్రి

నాసిరకం పనుల వల్లే..

నాడు-నేడు ద్వారా చేపట్టిన నాసిరకం పనుల కారణంగానే ఘటన జరిగింది. దీనిపై కమిటీ వేసి బాధ్యులను చట్టపరంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటాం. కృష్ణంరాజు కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుంది.
- కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపీ



ఎరువులకు తప్పని పాట్లు!

వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ భవనం వద్ద బుధవారం ఎరువుల కోసం రైతులు పోటీ పడ్డారు. ఉదయం నుంచే ప్రధాన ద్వారం నుంచి కింద వరకు బారులు తీరారు. చాలాసేపు పంపిణీ చేయకపోవడంతో తోపులాట చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు కేంద్రం వద్దకు చేరుకున్నారు. క్రమపద్ధతిలో పంపి సజావుగా పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేశారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. వ్యాపారుల దగ్గర అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

వలసల నివారణ దిశగా అడుగులు

కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు



శ్రీకాకుళం గ్రామీణ మండలం కుందువానిపేటలో బుధవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ అధ్యక్షతన జరిగిన సభలో కేంద్రమంత్రి మాట్లాడుతూ జిల్లాలో వలసల నివారణ దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. మూలపేటలో పోర్టు, భోగాపురంలో విమానాశ్రయం నిర్మాణంతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. శ్రీకాకుళంలో కూడా విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.
– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)


పూర్తి వివరాలు 6లో...

గత పాపాలు గాలిలో ప్రాణాలు..!

● అసంపూర్తిగా నాడు-నేడు పాఠశాల భవన నిర్మాణాలు
● నాణ్యతలేమితో కూలుతున్న కట్టడాలు

నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా విద్యా వ్యవస్థను మార్చేస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం ఊదరగొట్టింది.. ఒకటి, రెండు దశల పేరిట రూ.వందల కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటనలు గుప్పించింది. బడి రూపు మారిపోతుందని స్థానికులు సైతం ఆనంద పడ్డారు. కానీ అప్పటి ప్రభుత్వ తీరుతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి... గుత్తేదారులుగా మారిన పార్టీ అనుచరులు నాణ్యతకు పాతరేశారు.. బిల్లులు చెల్లించకపోవడంతో వారంతా మధ్యలోనే చేతులెత్తేశారు. ఇప్పుడవి విద్యార్థుల ప్రాణాల మీదకొస్తున్నాయి.. ఇందుకు ఉదాహరణ బుధవారం రణస్థలం మండలం పాతర్లపల్లి జడ్పీ పాఠశాలలో జరిగిన ఘటనే.. అసంపూర్తి భవన కిటికీ శ్లాబ్ కూలిపోయి విద్యార్థి మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన జిల్లాలోని నిర్మాణాలపైనా అనుమానాలకు తావిస్తోంది..
– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే బృందం


సరుబుజ్జిలి మండలం కొత్తకోట జడ్పీ పాఠశాలలో అర్ధాంతరంగా నిలిచిన నాడు-నేడు పనులు



బిల్లులు ఇవ్వని తీరు..

నాడు-నేడు కింద తలపెట్టిన పనులకు సింహభాగం వైకాపాకు చెందిన నేతలే గుత్తేదారులుగా వ్యవహరించారు. జిల్లాలో రెండో దశలో గుత్తేదారులకు వైకాపా ప్రభుత్వం రూ.170 కోట్లు బకాయి పడింది. ఎక్కడికక్కడ పనులు అర్ధాంతరంగా నిలిపేశారు. అదే పార్టీకి చెందిన రాజకీయ నేతల వద్దకు బిల్లులు మంజూరయ్యేలా చూడాలని పలుమార్లు తిరిగినా ఉపయోగం లేకుండా పోయిందని బహిరంగంగానే చెబుతున్నారు. శంకుస్థాపన చేసి కొంతమేర నిర్మాణాలు చేపట్టి బకాయిల నేపథ్యంలో పనులు నిలిపేశారు.

నాసిరకం, నాణ్యతా లోపం

నాడు-నేడు పనుల కింద పాఠశాలల్లో భవన నిర్మాణాలు చేపట్టే గుత్తేదారుల్లో చాలావరకు వైకాపాకు చెందిన వారే. దీంతో వీరిని అడిగేవారు లేకుండా పోయారు. ఇష్టానుసారంగా వ్యవహరించారు. నాణ్యతా ప్రమాణాలకు తూట్లు పొడిచి భవన నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలో నాడు-నేడు కింద చేపడుతున్న పాఠశాల భవనాలే కాదు. ఇప్పటి వరకు చేపట్టిన జగనన్న కాలనీలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల దుస్థితి ఇలానే ఉంది.


బూర్జ మండలం కేకేరాజపురంలో నాణ్యత లోపాల కారణంగా పునాదికి ఏర్పడిన బీటలు


పాతర్లపల్లి పాఠశాలలో కూలిన గోడ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు

★ జిల్లాలో మొత్తం పాఠశాలలు 2,600
★ వీటిలో విద్యార్థుల సంఖ్య సుమారు 1,96,394 మంది
★ నాడు నేడు తొలిదశలో మరమ్మతులకు గుర్తించిన భవనాలు : 958
★ రెండో దశలో కొత్త భవనాల మంజూరు : 1,054
★ నిధుల మంజూరు : రూ.416.89 కోట్లు
★ ఇచ్చింది కేవలం : రూ.156.46 కోట్లు
★ దీంతో భవనాలు వివిధ దశలలో నిలిచిపోయాయి.
★ వీటిలో చాలావరకు రెండేళ్లుగా నిలిచిపోయాయి. కారణం వైకాపా ప్రభుత్వం గుత్తేదారులకు బకాయిలు చెల్లించకపోవడం.

నాడు నేడు రెండోదశలో నిధుల వివరాలు.. (రూ.కోట్లలో)

పాఠశాలు	నిధులు మంజూరు	విడుదల చేసినవి	ఖర్చు చేసినవి	బకాయిలు
1054	416.89	156.46	166.01	170.31

ప్రమాదకరంగా...

జిల్లాలో నాడు-నేడు కింద గుర్తించిన 1,054 భవనాల్లో అధికశాతం పూర్తి చేయలేదు. అప్పటి ప్రభుత్వం కేటాయించినట్లు చూపిన నిధుల్లో ఒక వంతు మాత్రమే మంజూరు చేసింది. ఎక్కడికక్కడ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రమాదకరంగా మారాయి. ఎంపిక కాని సుమారు 250కి పైగా బడుల్లో భవనాలు శిథిలావస్థకు చేరాయి.


ఎల్‌ఎన్‌పేట: ముంగెన్నపాడులో


కోటబొమ్మాళి : కిష్టుపురంలో..


మెళియాపుట్టి మండలం కస్తూర్బా విద్యాలయంలో అసంపూర్తిగా భవనం, పంకాలు, విద్యుత్తు సౌకర్యం, కిటికీలు లేకుండానే తరగతులు నిర్వహిస్తున్నారు.

బారికేడ్లు పెట్టాలని ఆదేశం

నిర్మాణ దశలో ఉన్న పాఠశాల భవనాల వద్ద బారికేడ్లు పెట్టాలని ఇప్పటికే ఆయా అధికారులను ఆదేశించాం. పిల్లలు ఆడుకొనేటప్పుడు.. విరామ, భోజన సమయాల్లో ఉపాధ్యాయులు లేదా పీఈటీ ఉండాలని సూచించాం.
– స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్


టెక్కలి మండలం పాత నౌపడ గ్రామంలోని తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిన భవన సముదాయంలో తరగతులు నిర్వహిస్తున్నారు.

గార మండలం లింగాలవలస ప్రాథమికోన్నత పాఠశాల నిర్మాణ తీరిది.. ఇక్కడ 130 మంది విద్యార్థులు ఉన్నారు. వసతి సమస్య గుర్తించి భవనం ప్రారంభించినా మధ్యలోనే పనులు నిలిచిపోయాయి.



ఒకరి భూమి మరొకరికి..

● కొందరిది గల్లంతు ● అధికారుల తీరుతో రోడ్డెక్కిన అన్నదాత..


నిరసన ప్రదర్శనలో రైతులు

– న్యూస్‌టుడే, కొత్తూరు

హలం పట్టి పొలంలో ఉండాల్సిన అన్నదాత రోడ్డెక్కాల్సిన దుస్థితి ఇది.. కొందరు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎండలో సైతం లెక్కచేయక నిరసనకు దిగాల్సిన పరిస్థితి కొత్తూరు మండల కేంద్రంలో తలెత్తింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో భూ సర్వేలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి, తప్పులు తడకగా సర్వే చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇందుకు కొత్తూరు మండల పరిధిలో జరిగిన ఉదంతాలే నిదర్శనం.. విలువలైన భూములున్న కర్లెమ్మ రెవెన్యూ పరిధిలో రైతుల పేర్లు, వివరాలు, ఎల్‌పీఎం సంఖ్యలను మార్చేశారు. దీంతో అన్నదాతలు గత కొద్దిరోజులుగా చేస్తున్న పోరాటం బుధవారం తీవ్రమైంది. కర్లెమ్మ నుంచి కొత్తూరు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక నాలుగు రహదారుల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. కొద్దిసేపు వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూసర్వేలో అక్రమాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. తమ భూములను వేరే వ్యక్తులకు మార్చేశారన్నారు. భూమిని తక్కువగా నమోదు చేశారని వాపోయారు. ఇద్దరు రైతులకు ఒకే ఎల్‌పీఎం సంఖ్య కేటాయించి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. భూమికి ఆధార్ అనుసంధానం సైతం తప్పుగా నమోదు చేశారని తెలిపారు. ఇప్పుడు ఈ క్రాప్‌ను సైతం చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వివాహాలు, ఇతర అవసరాలకు సైతం భూములను అమ్ముకోలేకపోతున్నామన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. కొత్తూరు, కర్లెమ్మ, మహసింగి, నేతాజీగనర్ కాలనీ ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.


కొత్తూరు నాలుగు రహదారుల కూడలిలో మానవహారంగా ఏర్పడిన రైతులు

రోడ్డంటే ఖాతరు లేదు.. సమస్య పట్టింపు

అలికాం- బత్తిలి అంతర్రాష్ట్ర రహదారి.. శ్రీకాకుళం ఒడిశా ప్రాంతాలకు కలుపుతూ సాగే ఈ దారిలో నిత్యం వందల గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు.. భారీ వాహనాలు సైతం ఇటువైపే వెళతాయి. జిల్లాలో కీలక మార్గం అధ్వానంగా మారినా అధికారులు పట్టించుకోలేదు. ప్రమాదాలు జరుగుతున్నా చలనం లేదు.. వాహనాలు గోతుల్లోకి కూరుకుపోతున్నాయని ఘోషిస్తున్నా వినేవారు లేరు.. చివరికి మరమ్మతులకు గురవుతున్నా కన్నెత్తి చూడలేదు.. ముఖ్యంగా సరుబుజ్జిలి మండల పరిధిలోనే దారుణ స్థితి ఉంది. షళంత్రి కూడలి నుంచి గోనెపాడు కూడలి వరకు ప్రయాణం చేయాలంటే వాహన చోదకులు నరకాన్ని చూస్తున్నారు. సరుబుజ్జిలి పెట్రోల్ బంకు వద్ద ఏర్పడిన గుంతలు రోజురోజుకు మరింత పెరుగుతున్నాయి. గుంతల్లో దిగిపోయిన వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. వాహన చోదకులు లబోదిబోమంటున్నారు.
– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి


ఏబీ రోడ్డులో పెట్రోల్ బంకు వద్ద గుంతలో దిగిపోయిన ట్రాక్టర్


వ్యాను బాగు చేసేందుకు కుస్తీలు..


మరమ్మతులకు గురై రహదారి పక్కన ఆగిపోయిన లారీ

ఆదిత్యాలయంలో రోజువారీ కూలీల నియామకంపై విచారణ

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో దేవాదాయశాఖ అనుమతి లేకుండా జరిపిన రోజువారీ కూలీల నియామకంపై ఆ శాఖ ప్రాంతీయ సంచాలకుడు కె.సుబ్బారావు బుధవారం విచారణ చేపట్టారు. వైకాపా హయాంలో ఇష్టానుసారం చేపట్టిన నియామకాలు, ఆ సిబ్బంది భక్తుల నుంచి వసూళ్లకు పాల్పడటం, ఆదాయానికి గండి కొట్టడంపై ఉన్నతాధికారులు ఫిర్యాదులు వెళ్లాయి. వాటిపై కొద్ది నెలల కిందట డీసీ సుజాత విచారణ జరిపి ఆశాఖ కమిషనర్‌కు నివేదిక అందించారు. దాని ఆధారంగా కొందరిని విధుల నుంచి తప్పించారు. మరిన్ని వివరాల తెలుసుకునేందుకు ఆర్జేసీ సుబ్బారావు వచ్చారు. ఆలయ సిబ్బంది, ఖాళీల వివరాలు, ఇప్పటి వరకు చెల్లించిన వేతనాలు, తదితర సమగ్ర సమాచారం సేకరించారు. అభియోగాలు ఎదుర్కొంటున్నవారితో స్వయంగా మాట్లాడారు. పూర్తి వివరాలతో నివేదికను కమిషనర్‌కు నివేదిస్తామని, ఆయన ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


విచారణ చేస్తున్న దేవాదాయశాఖ ఆర్జేసీ సుబ్బారావు

పడవ బోల్తా.. మత్స్యకారుడి గల్లంతు


అప్పన్న

సోంపేట, న్యూస్‌టుడే: సముద్రంలో పడవ బోల్తా పడి మత్స్యకారుడు గల్లంతు కాగా ముగ్గురు సురక్షితంగా బయటపడిన ఉదంతమిది. సోంపేట మండలం బారువ కొత్తూరుకు చెందిన రట్టి అప్పన్న (45), రట్టి వీరాస్వామి, ఎర్ర మోహన్‌రావు, లంక యాదవరావు బుధవారం చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా సముద్రంలో అలల తాకిడికి పడవ బోల్తా పడింది. యజమాని అప్పన్న మినహా మిగిలిన ముగ్గురు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. అప్పన్న కోసం మత్స్యకారులు గాలిస్తున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి దుర్మరణం


సింహాచలం (పాత చిత్రం)

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన రణస్థలం మండలంలో బుధవారం చోటుచేసుకుంది. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నెలివాడకు చెందిన ఎందువ సింహాచలం(51) రణస్థలం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పని నిమిత్తం వచ్చి ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తున్నారు. దన్నానపేట సమీపంలోకి రాగానే వాహనం అదుపు తప్పి ప్రమాదం జరిగింది. ఘటనలో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన ఓ కంపెనీలో కార్మికుడిగా పని చేస్తున్నారు. మృతుడికి భార్య నారాయణమ్మ, కుమారులు గణేష్, నవీన్‌లు ఉన్నారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతోనే ప్రమాదం జరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు భాషను కాపాడాల్సిన బాధ్యత అందరిది

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: తెలుగు భాషను కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సాహితీవేత్త ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. బుధవారం డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రముఖ తత్వవేత్త, మహోపాధ్యాయ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వర్సిటీ వీసీ ఆచార్య కె.ఆర్.రజని మాట్లాడుతూ విశ్వవిఖ్యాత తత్వవేత్తగా పేరొందిన ఆచార్య సచ్చిదానందమూర్తి ఒక ప్రతిభావంతమైన సృజనాత్మక తాత్వికశక్తి అని అభివర్ణించారు. ఆయన జీవిత కాలంలో 35 తాత్విక గ్రంథాలను తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో రచించిన త్రిభాషా కోవిదుడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఆంగ్ల విభాగం అధ్యాపకులు డా. పి. రవికుమార్ రాసిన 'ఎలిమెంట్స్ ఆఫ్ లిటిల్ థియర్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. వర్సిటీ రెక్టార్ బిడ్డికి అడ్డయ్య, రిజిస్ట్రార్ పీలా సుజాత, ప్రధానాచార్యులు ఎస్.ఉదయ్‌భాస్కర్, ఎం.అనురాధ, సి.హెచ్.రాజశేఖర రావు, ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న పాల్గొన్నారు.


యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు సచ్చిదానంద మూర్తి చిత్రపటాన్ని అందజేస్తున్న వీసీ ఆచార్య కె.ఆర్.రజని, తదితరులు

నడవాలన్నా నరకమే..!

నరసన్నపేట ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్లే మార్గం బురదమయంగా మారింది. వందలాది మంది రోగులతో రద్దీగా ఉండే ఆసుపత్రికి వెళ్లే రహదారి పరిస్థితి ఇలా ఉండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు. రెండు రోజుల క్రితం ఆసుపత్రి ఆవరణలో మట్టి తొలగింపు చేపట్టడంతో మరింత అధ్వానంగా తయారైంది. ఈ విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు వద్ద ప్రస్తావించగా.. త్వరలో సమస్య పరిష్కరిస్తామన్నారు.
- న్యూస్‌టుడే, నరసన్నపేట



కత్తి చూపి ఆభరణాలు చోరీ

- సోంపేటలో కలకలం

సోంపేట, న్యూస్‌టుడే: పట్ట పగలు గుర్తు తెలియని వ్యక్తి ఓ ఇంట్లోకి ప్రవేశించి కత్తి చూపి బంగారు ఆభరణాలు కాజేయడంతో సోంపేటలో కలకలం రేగింది. మహాదేవిపేటలో బుధవారం ఉదయం 10 గంటల సమయంలో గుంటుకు కామేశ్వరరావు ఇంటికి ఓ వ్యక్తి వచ్చాడు. భార్య జీవరత్నంతో మాట్లాడుతూ తాగడానికి నీరు కావాలని అడిగాడు. ఆమె తీసుకురావడానికి వెళ్లగా అతను వెనుక వెళ్లి కత్తి చూపి మెడలోని పుస్తెల తాడు సహా ఐదు తులాల బంగారు ఆభరణాలు తెంచి బయటకు వచ్చేశాడు. అతని ప్రయత్నాన్ని అడ్డుకునే క్రమంలో ఆమె చేతిపై గాయమైంది. అప్పటికే రోడ్డుపై ద్విచక్ర వాహనంతో సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో కలిసి పరారయ్యాడు. ఆ సమయంలో భర్త ఇంట్లో భగవద్గీత చదువుతున్నారు. జీవరత్నం కేకలు పెట్టినప్పటికీ ఆయనకు వినికిడి సమస్య ఉండటంతో తెలియలేదు. ఆ వీధిలో ఒకరు దుండగుడిని ఆపడానికి ప్రయత్నించగా కత్తి చూపి బెదిరించాడు. నాలుగు రోడ్ల కూడలి.. సమీపంలో డీసీసీబీ బ్యాంకు ఉన్న ప్రాంతంలో చోరీ జరిగిన ఇల్లు ఉండటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సీఐ మంగరాజు, ఎస్సై బి.హైమావతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దగ్గర్లోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన దృశ్యాలను చూసి ఓ అనుమానిత వ్యక్తి సంచరించినట్లు కనుగొన్నారు.


కత్తి గాయం చూపుతున్న బాధితురాలు జీవరత్నం

బంగారు నగల తయారీదారులే లక్ష్యం

మహాదేవిపేటలో మూడు రోజుల నుంచి ఇద్దరు అనుమానితులు రెక్కీ నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రాంతంలో తపాలా కార్యాలయం, వ్యాపార సంస్థలు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, జగన్నాథ ఆలయం, బాలుర ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉండటంతో రద్దీగా ఉంటుంది. ఈ వీధిలో ఎక్కువగా ఉండే బంగారు నగల తయారీదారులను లక్ష్యంగా చేసుకుని దుండగులు చోరీకి ప్రయత్నించినట్లు తెలిసింది. ఉదయం నుంచి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వీధిలో తిరుగుతుండటంతో స్థానికులు అనుమానించి ప్రశ్నించారు. ఈక్రమంలో కామేశ్వరరావు ఇంట్లోకి ప్రవేశించి ఆయన భార్య మెడలో బంగారు ఆభరణాలు కాజేశారు.

వరుస ఘటనలతో బెంబేలు

సోంపేటలో ఇటీవల వరుస చోరీలు జరుగుతుండటంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. మొగలికొత్తూరు పాఠశాల పక్కన ఓ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి రూ.40 వేలు కాజేశారు. వేర్వేరు ప్రాంతాల్లో నాలుగు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. చికెన్ దుకాణం యజమానికి చెందిన రూ.2.80 లక్షల విలువైన బుల్లెట్ అపహరించారు. పెట్రోల్ బంకు వద్ద విశ్రాంత ఉపాధ్యాయుడి ఇంటి తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు.

మళ్లీ తెరపైకి బంగారం మాయం కేసు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: గతేడాది నవంబరులో జిల్లాలో సంచలనం సృష్టించిన ఎస్‌బీఐ గార శాఖలోని బంగారం మాయం కేసు మళ్లీ తెరపైకి వచ్చింది. డీఎస్పీ వివేకానంద నేతృత్వంలో ఓ బృందం దర్యాప్తును బుధవారం పునఃప్రారంభించింది. అప్పటి ఎస్పీ కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేశారు. అయితే కేసు కొలిక్కి రాకుండానే దర్యాప్తు నిలిపివేశారు. ఖాతాదారులు కుదవ పెట్టిన బంగారు ఆభరణాలను వేరే చోట తాకట్టు పెట్టి.. ఆ సొమ్మును ఎవరు వినియోగించుకున్నారు, ఆడిట్‌లో అసలు ఆభరణాలు పోలేదని నివేదిక ఎందుకిచ్చారు వంటి విషయాలు తేలక పోవడంతో మళ్లీ దర్యాప్తు మొదలుపెట్టారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆ కేసును కొలిక్కి తీసుకురావాలని డీఎస్పీని ఆదేశించడంతో అప్పట్లో ఎస్‌బీఐ ఆర్ఎంగా పని చేసిన రాజు, బ్యాంక్ మేనేజర్లు రాధాకృష్ణ, చంద్రశేఖర్, నలుగురు బ్యాంక్ ఆడిట్ ఉద్యోగులు, క్యాషియర్, ఇతర సిబ్బంది నుంచి వివరాలు ఆరా తీస్తున్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	215	235

కోళ్ల వాహనం బోల్తా

జాతీయ రహదారిపై టెక్కలి మండలం బొప్పాయిపురం వద్ద బుధవారం వేకువ జామున కోళ్ల లోడుతో వెళ్తున్న వ్యాను అదుపు తప్పి బోల్తా పడింది. ఒడిశా నుంచి పార్వతీపురం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇందులో 400లకు పైగా కోళ్లు మృతి చెందాయి. వాహనం డ్రైవర్, గేదెల పొలయ్య, క్లీనర్ అప్పలనాయుడు గాయపడ్డారు.
- న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం



పెద్ద చెరువు.. ఆక్రమణల జోరు!

నందిగాం, న్యూస్‌టుడే

వైకాపా పాలనలో అక్రమాలు ఇప్పటికీ వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. పేద రైతుల వ్యవసాయానికి ఉపయోగపడుతున్న చిన్న నీటి వనరుల రూపురేఖలు మార్చేశారు. చదును చేసి పంటలు సాగు చేసుకుంటున్నారు. స్థానిక కర్షకులు ప్రశ్నిస్తే 'ప్రభుత్వం మా చేతుల్లో ఉంది.. రెవెన్యూ అధికారులు మమ్మల్నేం చేయలేరు' అంటూ పేట్రేగిపోయారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోతే కొత్త చెరువు మాదిరిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


చెరువు గర్భంలో సాగు చేస్తున్న పంటలు

నందిగాం మండలం సుభద్రాపురం వద్ద సర్వే నంబరు 92లో 103 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద చెరువు ఉంది. దీని ద్వారా సుమారు 100 ఎకరాలకు సాగునీరు అందుతోంది. 1989లో ఇక్కడి నుంచి వంశధార ప్రధాన ఎడమ కాలువ తవ్వారు. చెరువు రెండు పాయలుగా విడిపోయింది. చెరువుకు వరద నీరు రావడానికి వీలుగా వంశధార అధికారులు కాలువ నిర్మించారు. దీనికి తూర్పు వైపు, చెరువు గర్భం పడమర వైపు సుమారు 54 ఎకరాలు ఆక్రమణకు గురైంది. పొలాలుగా మార్చేయడంతో చెరువు విస్తీర్ణం తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ అధికారులు చిన్న నీటి వనరుల జాబితా నుంచి తపించారు. ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2018లో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయడంతో చెరువు నీరు పెద్దగా అవసరం లేదని 2019-2024 మధ్య ఆక్రమణదారులు రెచ్చిపోయి సాధ్యమైన మేరకు చెరువు గర్భాన్ని ఆక్రమించారు. కూటమి ప్రభుత్వం ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు.

యథాస్థితి కొనసాగించాలి



కొత్త చెరువు మాదిరిగా పెద్ద చెరువును కూడా కనుమరుగు చేయడానికి ఆక్రమణదారులు బరి తెగిస్తున్నారు. ఈ రెండు చెరువులపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టి సారించాలి. ఆక్రమణదారులు, వారికి సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- కుజ్జ బాలకృష్ణ, రైతు, సుభద్రాపురం

హద్దులు దాటి వచ్చారు..



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా పెద్ద చెరువు గర్భంలో ట్రెంచ్ కొట్టాం. ఇక్కడి వరకు చెరువు విస్తీర్ణం ఉందని చెప్పాం. గత ఐదేళ్లలో దీన్ని దాటి మరీ ఆక్రమించేశారు
- ఆకుల బాబూరావు, క్షేత్ర సహాయకుడు, ఉపాధి హామీ పథకం, సుభద్రాపురం

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం..

పెద్ద చెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాం. ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. ఆర్ఐ, సర్వేయర్లతో కలిసి పరిస్థితిని సమీక్షిస్తాం.
- భాగ్యలక్ష్మి, తహసీల్దారు, నందిగాం

కొత్తమ్మ తల్లి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన


కొత్తపేటలో ద్విచక్రవాహనంపై శ్రేణులతో కలిసి పర్యటిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాల ఏర్పాట్లను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం పరిశీలించారు. కొత్తపేట నుంచి కోటబొమ్మాళి వరకు పార్టీ నేతలు, అభిమానులతో పర్యటించారు. ఒకటే రహదారి కావడంతో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. అన్నదాన ప్రదేశాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ప్రాంతాలను చూశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. తెదేపా నాయకులు కింజరాపు ప్రసాదరావు, గోవిందరాజు, పార్టీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ ఎంపీపీలు రామకృష్ణ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తాం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళంలో కూడా విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం కుందువానిపేటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలనలో అనేక కార్యక్రమాలను చేయాల్సి ఉన్నప్పటికీ గత పాలకుల నిర్వాకంతో కొన్ని మాత్రమే చేయగలిగామన్నారు. మత్స్యకారులు వలసలు వెళ్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కుందువానిపేట గ్రామ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి కె.అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ కాలినడకన తిరుమల కొండెక్కినా ఆయన చేసిన పాపాలు పోవని విమర్శించారు. వేంకటేశ్వర స్వామి భక్తులందరినీ ఆయన మోసం చేశారని మండిపడ్డారు. అనంతరం కుందువానిపేటలోని హుద్‌హుద్ ఇళ్లకు సంబంధించిన పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, గృహనిర్మాణ సంస్థ పీడీ బి.నగేష్, తహసీల్దార్ ఎం.గణపతిరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో రఘు, సర్పంచి ఎస్.సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మూలపేట పోర్టు భూసేకరణ రీసర్వే

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: మండలంలోని మూలపేట పోర్టు భూములు రీసర్వే గురువారం నుంచి ప్రారంభించడానికి రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలతో జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 10 బృందాలు, ఇద్దరు తహసీల్దార్, ఇద్దరు ఆర్ డీటీ, ఆర్ఐలు, సర్వేయర్లు, వీఆర్వో, ఇతర సిబ్బంది మూలపేట పోర్టుకు భూములను గురువారం నుంచి రీసర్వే చేయనున్నారు. గతంలో 317.96 ఎకరాల జిరాయతీ భూముల్లో 277 ఎకరాల భూసేకరణ చేసి రూ.72.84 కోట్ల పరిహారం అందజేశామని, 41 ఎకరాల భూములు రైతులు ఇవ్వలేదని మూలపేటలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి రెవెన్యూ అధికారులు తీసుకొచ్చారు. మూలపేట పోర్టు భూసేకరణ పరిహారం, పీడీఎఫ్ చెల్లింపుల్లో వైకాపా నేతలు, కార్యకర్తలు అడ్డగోలుగా దోచుకున్నారని, దానికి అప్పట్లో పనిచేసిన అధికారులు పూర్తిస్థాయిలో సహకరించారని, ఇతర ప్రాంతాల అధికారులతో రీసర్వే చేసి హెచ్చుతగ్గులు లేకుండా చూడాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని మాజీ సర్పంచి జీరు భీమారావు, నారంనాయుడు, సుందరరావు తదితరులు మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో యుద్ధప్రాదిపదికన భూసేకరణ రీసర్వే పనులు ప్రారంభించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. రీసర్వేకు అధికారులను నియమించిన రెవెన్యూ అధికారులు వారం రోజుల పాటు మూలపేట పోర్టు భూసేకరణ రీసర్వే పూర్తిచేయడానికి ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేశారు.

పిచ్చికుక్క దాడిలో 20 మందికి గాయాలు

పోలాకి, న్యూస్‌టుడే: పోలాకి మండలంలోని కుసుమపాలవలస, చల్లబంద గ్రామాల్లో ఓ పిచ్చి కుక్క బుధవారం స్వైర విహారం చేసింది. వీధుల్లో తిరుగుతున్న వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. రెండు గ్రామాలకు చెందిన 20 మందిని చేతి వేళ్లు, కాలు తుంటి భాగాలపై కరిచింది. గాయపడిన వారంతా నరసన్నపేట సర్వజనాసుపత్రికి వెళ్లి చికిత్సలు పొందారు. చల్లబంద గ్రామస్థులు దాన్ని కొట్టి చంపారు.

8వ సారి తలనీలాల సేకరణ వేలం వాయిదా

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణ స్వామికి భక్తులు మొక్కుల రూపంలో సమర్పించే తలనీలాల సేకరణ లీజు హక్కు పొందేందుకు అధికారులు నిర్వహించిన వేలం మరోసారి వాయిదా పడింది. అనివెట్టి మండపంలో బుధవారం వేలం నిర్వహించగా పాల్గొనేందుకు ఒకే ఒక్కరు రావడంతో అధికారులు వాయిదా వేశారు. ఈ ఏడాది మార్చి నెలాఖరుతో గతంలో నిర్వహించిన తలనీలాల లీజు హక్కు గడువు ముగిసిపోయింది. నాటి నుంచి ఇప్పటి వరకు 8 సార్లు వేలం ప్రక్రియ నిర్వహిస్తున్నా.. వాయిదా పడుతూనే వస్తోంది. గతంలో ఏటా ఈ లీజు హక్కుల ద్వారా ఆలయానికి సుమారు రూ.కోటి వరకు ఆదాయం సమకూరేది. ఈ ఏడాది నాలుగోసారి ఓ వ్యక్తి రూ.63 లక్షలకు లీజును దక్కించుకున్నప్పటికీ దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఆ వేలాన్ని రద్దు చేశారు. తలనీలాల వేలం ఖరారు కాకపోవడంతో గత ఆరు నెలలుగా ఆలయ అధికారుల పర్యవేక్షణలో సిబ్బందే వాటిని సేకరిస్తున్నారు. మార్కెట్‌లో తలనీలాలకు గిరాకీ ఉండటంతో రాత్రి వేళ గుట్టుచప్పుడుగా బయటకు తరలిపోతోందనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు చొరవ తీసుకుని వేలం ఖరారు అయ్యేలా చర్యలు చేపట్టి ఆలయ ఆదాయానికి గండి పడకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు. ఎక్కువ మంది రాకపోవడంతో వేలం రద్దు చేశామని, మరోసారి నిర్వహిస్తామని ఈవో డి.ఎల్.వి.రమేష్‌బాబు తెలిపారు.

అనుమతుల్లేకున్నా కట్టేస్తాం..!

కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడటం లేదు. అధికారుల అనుమతుల్లేకుండానే కొందరు పనులు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడంతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది. గతంలో పలు మార్లు అక్రమ నిర్మాణాలపై విచారణలు జరిగినా ఫలితం కనిపించలేదు. తాజాగా ఈ వ్యవహారం శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) దృష్టికి చేరినా పెద్దగా ప్రయోజనం లేదని విమర్శలు వెల్లువెత్తున్నాయి.

న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

వైకాపా హయాంలో కోటబొమ్మాళిలో ఇష్టానుసారం అక్రమ నిర్మాణాలు జరిగాయి. ఆ విషయమై 'ఈనాడు'లో గత నెల 13న 'అనుమతులు లేకుండానే నిర్మాణాలు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దానికి స్పందించిన సుడా అధికారులు లెక్కలు తేల్చేందుకు రంగంలోకి దిగారు. మేజర్ పంచాయతీ పరిధిలోని పలు వాణిజ్య దుకాణాలు, భవన నిర్మాణాలను పరిశీలించారు. కానీ పంచాయతీ అధికారులు పూర్తిస్థాయిలో అక్రమ నిర్మాణాలపై వివరాలు ఇవ్వకపోవడంతో విచారణలో జాప్యం జరుగుతోంది. గతంలోనూ టెక్కలి డీఎల్‌పీవో విచారణ జరిపినా నివేదికను బహిరంగ పరచకపోవడంతో ఫలితం లేకుండా పోయింది.



నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఓ భవన నిర్మాణం

తెల్లకాగితంపై అనుమతులు..

పంచాయతీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన నిర్మాణాలు ఎన్ని ఉన్నాయనే వివరాలు సుడాకు సమర్పించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. మరోవైపు పక్కా రసీదులు లేకుండా తెల్లకాగితాలపై సంతకాలు చేసి అనుమతులివ్వడం సందేహాలకు తావిస్తోంది. కొందరు ఇళ్ల కోసం అనుమతులు తీసుకుని వాణిజ్య సముదాయాలు నిర్మించుకుని అద్దెలకిచ్చి రూ.వేలల్లో సంపాదిస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతుందని యంత్రాంగానికీ తెలిసినా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. 'ఇప్పటివరకు అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాల విషయాలు కొన్ని సుడా దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలోనే సమగ్ర వివరాలు అందజేస్తాం.' అని ఈవో చింతాడ సన్యాసి చెబుతున్నారు.

వెలుగులోకి చాలా లోపాలు..

కోటబొమ్మాళి మేజర్ పంచాయతీలో అక్రమ నిర్మాణాలపై పంచాయతీ అధికారులు ఇప్పటి వరకు ఇచ్చిన వివరాలపై విచారణ చేశాం. అందులో చాలా లోపాలు వెలుగులోకి వచ్చాయి. పూర్తిస్థాయి అనుమతుల్లేకుండానే కొన్ని పనులు జరుగుతున్నాయి. పంచాయతీ అధికారులు ఇంకా పూర్తి వివరాలు ఇవ్వాల్సి ఉంది. అవి వచ్చిన తర్వాత క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలకు ఉన్నతాధికారులను నివేదిస్తాం.
- అబ్దుల్ సలీం, ప్రణాళిక కార్యదర్శి, సుడా

టెక్కలికి ఉద్యానశాఖ ఏడీ కార్యాలయం మంజూరు

టెక్కలి, కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: టెక్కలిలో ఉద్యానశాఖ సహాయ సంచాలకుడి (ఏడీ) కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో విజయనగరంలోని ఉద్యానశాఖ సహాయ సంచాలకుడి కార్యాలయం, ఇతర సిబ్బందిని టెక్కలికి తరలిస్తూ ఏర్పాటయ్యేలా దిశా నిర్దేశం చేసింది. గతంలో జిల్లాల విభజన నేపథ్యంలో టెక్కలిలోని ఈ శాఖ సహాయ సంచాలకుడి కార్యాలయాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాకు తరలించారు. ఈ శాఖ సంచాలకుడి నివేదిక ప్రకారం టెక్కలి డివిజన్‌లోని ఉద్యానం ప్రాంతం, ఇతర ప్రాంతాల అవసరం దృష్ట్యా టెక్కలిలో సహాయ సంచాలకుడి కార్యాలయం ఏర్పాటు అవసరాన్ని వివరించారు. ఈ మేరకు విజయనగరం నుంచి కార్యాలయాన్ని పూర్తిస్థాయిలో సిబ్బందితో సహా తరలిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఉద్యానశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవ, కృషితో కార్యాలయం ఏర్పాటు సాధ్యమవుతుందని పలువురు రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కార్యాలయం ఏర్పాటుతో డివిజన్‌లో ఉద్యాన తోటలు సాగు చేసే రైతులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని, ఈ పంటల విస్తరణకు మరింత ప్రోత్సాహం, సహకారం లభిస్తుందని రైతు సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.


గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు టాస్క్‌ఫోర్స్

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: జిల్లాలో గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. కాశీబుగ్గ, ఇచ్ఛాపురం గ్రామీణ పోలీసు స్టేషన్ల పరిధిలో స్వాధీనం చేసుకున్న గంజాయి కేసులకు సంబంధించి కాశీబుగ్గలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఒడిశాకు చెందిన త్రిలోచ సామంతరాయ్ 1.33 కిలోల గంజాయి హైదరాబాద్ తీసుకెళ్లడానికి ద్విచక్ర వాహనంపై పలాస వస్తుండగా పట్టుకుని అరెస్ట్ చేశారు. ఒడిశాకు చెందిన బభ్రుబహన్ స్వైన్, సూరత్‌కు చెందిన లలిత ప్రదీప్ ఖైన్నర్ ఇచ్ఛాపురంలో 82.200 కిలోల గంజాయితో పట్టుబడ్డారు. వీరు బ్రహ్మపుర నుంచి సంచుల్లో సరకును రైలులో గుజరాత్ తరలించడానికి ఇచ్ఛాపురం తీసుకురాగా అరెస్టు చేశారు. వారి వద్ద రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గత 20 రోజుల్లో జిల్లాలో 12 కేసులు నమోదు చేసి 31 మందిని అరెస్టు చేశారు. 230 కిలోల గంజాయి సీజ్ చేశారు. ఏడాదిలో 23 కేసుల్లో 70 మందిని అరెస్ట్ చేసి 490 కిలోల సరకు స్వాధీనం చేసుకున్నారు' అని వివరించారు. అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, కాశీబుగ్గ, ఇచ్ఛాపురం సీఐలు డి.మోహనరావు, ఎం.చిన్నంనాయుడు, ఎస్సై శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

గ్రామాల్లో సురక్షిత తాగునీరందించండి

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలకు సురక్షిత తాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్తు అధ్యక్షురాలు పిరియా విజయ ఆదేశించారు. శ్రీకాకుళం నగరంలో బుధవారం జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరించాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో గృహనిర్మాణ సంస్థ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌శాఖల అధికారుల పని తీరు అధ్వానంగా ఉందన్నారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పలువురు జడ్పీటీసీ సభ్యులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్, అధికారులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న జడ్పీ అధ్యక్షురాలు విజయ

పలాస
• పలాస • ఇచ్ఛాపురం

న్యాయం చేయాలని వినతి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాస మండలం బొడ్డపాడు, రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో భూములు కోల్పోయిన తమకు న్యాయం చేయాలని పలువురు రైతులు కోరారు. గతంలో ఇచ్చిన వినతిపై ఆర్డీవో భరత్‌నాయక్ బుధవారం వారితో సమీక్ష నిర్వహించారు. గతంలో ఆఫ్‌షోర్ జలాశయం నిర్వాసితుల ఇళ్ల కాలనీ కోసం రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో 50 ఎకరాలు, టిడ్కో ఇళ్ల కోసం బొడ్డపాడు పరిధిలో 20 ఎకరాల డీ పట్టా భూములు తీసుకుని పరిహారం చెల్లించలేదన్నారు. ఎంఐజీ లేఅవుట్ కోసం సేకరించిన 152 ఎకరాలకు సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని అప్పటి మంత్రి, కలెక్టర్ హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. తహసీల్దారు సత్యం, ఉప తహసీల్దారు లక్ష్మీనారాయణ, బొడ్డపాడు సర్పంచి టి.మధన్, ఎంపీటీసీ సభ్యుడు ఎం.పాపారావు, బి.సుధాకర్, ఎం.రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్య : ఇచ్ఛాపురం బెల్లుపడ కాలనీ మొదటి లైనులో కాలువను కప్పేస్తూ మెట్లు, అరుగుల నిర్మాణం చేపట్టడంతో వర్షపు నీరు రోడ్డుపై పారుతోంది.
–పి.రవికిరణ్, ఇచ్ఛాపురం

సమాధానం : కాలువలను మూసివేలా ఎలాంటి నిర్మాణాలు ఉన్నా తొలగిస్తాం. – ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం

సమస్య: వజ్రపుకొత్తూరు మండలం ఉద్దానంగోపీనాథపురం ప్రధాన కూడలి వద్ద 30 ఏళ్ల కిందట నిర్మించిన బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు ఆరుబయట నిరీక్షిస్తున్నారు. –కేశవరావు, స్థానికుడు

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి నూతన నిర్మాణానికి కృషి చేస్తాం.
–ఈశ్వరమ్మ, ఎంపీడీవో, వజ్రపుకొత్తూరు

సమస్య: పలాస మండలం కంట్రగడ కాలనీలో మురుగు కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం. – స్థానికులు

సమాధానం: త్వరలోనే కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరిస్తాం.
– సద్గుణ, పంచాయతీ కార్యదర్శి, రెంటికోట
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు గ్రామీణం, పలాస గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా
(10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం:	9440437129
పలాస :	8008574279
కవిటి గ్రామీణం :	8309638875
పలాస గ్రామీణం:	7386408926
కంచిలి గ్రామీణం:	9704568738

ఇచ్ఛాపురంలో వార్డులు	జనాభా సుమారు	ప్రజా కుళాయిలు	వ్యక్తిగతం
23	44 వేలు	124	1,857

నీటిఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలు : ఏఎస్‌పేట, పురుషోత్తపురం, కస్పా వీధి, కొండపోలమ్మ కాలనీ, బెల్లుపడ కాలనీ, బెల్లుపడలోని కొన్ని వీధులు, దానంపేట, కంచ్ర కాలనీ, కంచ్ర వీధి, రత్తకన్నలో కొన్ని వీధులు, నాయీబ్రాహ్మణ కాలనీ, సంతపేట

గత పాలకుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం!

అందుబాటులోకి రాని రక్షిత నీటి పథకం

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

'ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో రక్షిత నీటి పథకం నిర్మాణానికి ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) నుంచి రూ.58.83 కోట్లు మంజూరయ్యాయి. కొంతవరకు పనులు జరిగాయి. గుత్తేదారుకు బిల్లులు మంజూరు చేయలేదని అర్ధాంతరంగా ఆపేశారు. పనులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలి' అని ఇటీవల కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లకు పురాధ్యక్షురాలు పిలక రాజలక్ష్మి విజ్ఞప్తి చేశారు.



తాగునీరు పట్టుకోవడానికి నిత్యం ఇబ్బందులే..

● ఇచ్ఛాపురం మధ్యగా ప్రవహించే బాహుదా నది చుట్టూ సుమారు 100 చెరువులు, గెడ్డ ఉన్నా పట్టణ వాసులు దాహార్తి తీర్చుకోవడానికి రూ.25 వెచ్చించి శుద్ధజలం కొనుగోలు చేస్తున్నారు. పురుషోత్తపురానికి సమీపంలో రైలు పట్టాలకు పక్కన నేల బావిలో ప్రస్తుతం భూమట్టాన్ని తాకేలా నీరుంది. వేసవిలోనూ మూడు అడుగులలోనే లభ్యమవుతోంది. ఈ ప్రాంతంలో బోర్లు వేసి పురుషోత్తపురం, ఏఎస్‌పేట ప్రాంతాలకు నీరందించవచ్చు. మూడున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న బాహుదా నది నుంచి నీటిని గొట్టాల ద్వారా రిజర్వాయర్‌కు చేర్చి ఆపై కుళాయిలకు నీరందించేలా పథకాన్ని రూపొందించారు. అది పూర్తికాక మూడు వార్డుల ప్రజలు తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్నారు.

● తెదేపా పాలనలో తీర ప్రాంత గ్రామాలకు రక్షిత నీరు అందించడానికి ఎన్టీఆర్ సుజల పథకాన్ని అమలు చేసింది. ఇచ్ఛాపురం పట్టణ వాసులకు ప్రస్తుతం అరకొరగా నీరిచ్చే మంచి నీటి పథకం 18 ఏళ్ల కిందట అందుబాటులోకి వచ్చింది. అప్పటి జనాభా, నివాస ప్రాంతాలకు అనుగుణంగా దీన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం విస్తరించిన ప్రాంతాలకు నీరు అందడం లేదు.

పూర్తయ్యేలా చూస్తాం..

ఇచ్ఛాపురంలో మంచి నీటి సరఫరా సక్రమంగా లేకపోవడం బాధాకరం. నిధులు, పనులు చేసే యంత్రాంగం ఉన్నప్పటికీ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి పూర్తిస్థాయిలో సమీక్షించి పథకం నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేస్తాం.
– బెందాళం అశోక్, ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం

ఇదీ పరిస్థితి

● కొత్త పథకంలో భాగంగా 44 కిలోమీటర్ల మేర వీధుల్లో పైపులైను ఏర్పాటు చేయాలి. ఇందుకు రూ.23.42 కోట్లు కేటాయించారు. ఆయా పనులను ఓ కంపెనీకి అప్పగించారు. మరో రూ.35.41 కోట్లతో ప్రధాన గొట్టాల అమరిక, మూడు నీటి నిల్వ ట్యాంకులు, ఊటబావుల వద్ద అదనపు నిర్మాణ తదితర పనులను మరో కంపెనీకి కేటాయించారు. పురుషోత్తపురం వద్ద కొండపై 12 ఏళ్ల కిందట 250 కిలోలీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ట్యాంకును వినియోగించుకోవచ్చునని ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు గుర్తించారు.



నిలువెత్తు లోతు గుంతలో కుళాయి

● 1, 2, 3 వార్డులకు నీరు అందించేలా దీని పక్కనే మరో 250 కిలోలీటర్ల ట్యాంకు నిర్మించాలి. ప్రధాన పైపులైన్ ఏర్పాటుకు రూ.90 లక్షలు కేటాయించారు. ఆయా పనులు బెల్లుపడ కాలనీ వరకు పూర్తయ్యాయి. బాహుదా నది కొత్త వంతెనకు 80 మీటర్ల దూరంలో రెండు ఊటబావులు నిర్మించారు. ఇక్కడ గట్టు కట్టాలి. పట్టణంలో 800 కిలోలీటర్ల రిజర్వాయరు, పురుషోత్తపురంలో 250 కేఎల్, రత్తకన్నలో 250 కేఎల్ రిజర్వాయర్లు నిర్మించాలి. ఈలోపు పనులు స్తంభించాయి. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించి ఉంటే ఇప్పటికి ప్రారంభోత్సవానికి పథకం సిద్ధమయ్యేది.



బాహుదా నది కొత్త వంతెనకు సమీపంలో ఊట బావులు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



అనంతగిరిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మధు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, సోంపేట, ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం గ్రామీణం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: సరైన యాజమాన్య పద్ధతులు, మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పలువురు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు. వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో పలాస ఏడీఏ ఎల్వీ మధు మాట్లాడుతూ ఎరువుల వినియోగంలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. సోంపేట మండలం మాకన్నపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్, రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఉదయ్‌బాబు మాట్లాడారు. ఇచ్ఛాపురం పట్టణ పరిధి బెల్లుపడ, మండల పరిధి బిర్లంగి గ్రామాల్లో ఈ-పంట నమోదు ప్రక్రియను, సేంద్రియ పద్ధతిలో పిచికారీ ద్రావణ తయారీ విధానం అంశాలపై అవగాహన కల్పించారు. కవిటి మండలం జెజ్జిపుట్టుగ, బొరివంక గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు.

విజేతకు అభినందన

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి రామకృష్ణాపురంలోని సత్యసాయి విద్యావిహార్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థి కోట కల్యాణ్ హరీష్ కిరణ్ జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో ప్రథమ స్థానం సాధించాడని ట్రస్టు ఛైర్మన్ రామేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఈ పోటీలు జరిగాయి. బాలుడిని ప్రిన్సిపల్ ప్రీతీ చౌదరి తదితరులు అభినందించారు. త్వరలోనే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు.

చెత్తతో చిక్కులు



పలాస మండలం బ్రాహ్మణతర్లాలో కడి వీధి వద్ద రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయింది. దుర్వాసన వ్యాపిస్తుండటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే ఎక్కడికక్కడు మురుగు నీరు నిలిచిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి లక్ష్మణరేఖను 'న్యూస్‌టుడే' సంప్రదించగా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

జనసేన నాయకుల ప్రాయశ్చిత్త పూజలు

తిరుమల లడ్డూకు అపచారం జరిగిన నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన్న ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా జనసేన పార్టీ పలాస నియోజకవర్గ నాయకులు మందసలోని వాసు దేవాలయంలో బుధవారం ప్రాయశ్చిత్త పూజలు చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వి.దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ పండా, మండల అధ్యక్షుడు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, మందస



కిష్టుపురంలో విష జ్వరాలు



గౌతు లచ్చన్న వీధిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి కిష్టుపురంలో సుమారు పది మంది విష జ్వరాలతో బాధపడుతున్నారు. వారిలో ముగ్గురికి ప్లేట్‌లెట్లు తగ్గడంతో డెంగీ జ్వరమనే అనుమానంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడమే జ్వరాల వ్యాప్తికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై ఎంఎల్‌హెచ్‌పీ ఇందుమతిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా కిస్టుపురంలో గురువారం వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

పలాస సత్యసాయి సేవా సమితి ఆవరణలో బుధవారం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో నేత్ర పరీక్షలు నిర్వహించారు. 128 మందికి పరీక్షలు నిర్వహించగా 60 మందికి శస్త్రచికిత్స చేయాలని సిఫార్సు చేశారు. కన్వీనర్ డి.జగదీష్, సభ్యులు జేసీ హెచ్ శ్రీనివాసరావు, బి.కామేశ్వరరావు, టి.రమేష్, పి.కొండలరావు, శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యుడు సురేష్, మేనేజర్ సాయికుమార్, సమన్వకర్త ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, పలాస



మహిళా సర్పంచిని అవమానించడం తగదు



నినాదాలు చేస్తున్న సర్పంచి సుశీల, గ్రామస్థులు

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయంలో కుర్చీని తొలగించి అవమానించారని పాతటెక్కలి సర్పంచి తుంగాన సుశీల ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయం ఎదురుగా బుధవారం ఆమె అనుచరులతో కలిసి నిరసన తెలిపారు. 'సచివాలయంలో సొంత ఖర్చుతో ఏర్పాటు చేసుకున్న కుర్చీని చెత్త తరలించే ట్రాలీలో ఇంటికి పంపారు. తెదేపా స్థానిక నాయకులు రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారు. పంచాయతీ కార్యదర్శి మధు వారికి వంత పాడుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లాం. ఎస్సీ, మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తాం' అని స్పష్టం చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా సర్పంచి భర్త నిబంధనలకు విరుద్ధంగా సచివాలయంలో సొంత కుర్చీ వేసుకుని కూర్చోవడంతో సిబ్బంది విధులకు ఇబ్బంది కలుగుతోందనే కారణంతో తొలగించినట్లు తెలిపారు.

ఇది ప్రజల ప్రభుత్వం



సోంపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

పలాస గ్రామీణం, ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం, వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని పలువురు నాయకులు పేర్కొన్నారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. పలాస మండలం బ్రాహ్మణతర్లాలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించారు. ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ● సోంపేట మండలం మాకన్నపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.



పలాస గ్రామీణం: ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష, నాయకులు

వరద బాధితులకు ఆపన్నహస్తం



విజయవాడలో వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి చిన్నబడాంలోని సాయిశిరీష ఉన్నత పాఠశాల యాజమాన్య ప్రతినిధులు కవిటి భారతి, రేణుకేశ్వరరావు రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. పలాసలోని తెదేపా కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి చెక్కు అందజేశారు. – న్యూస్‌టుడే, పలాస

బొడ్డపాడులో ఉన్నం సంతాప సభ

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి బొడ్డపాడులో బుధవారం అమరుల బంధుమిత్రుల సంఘం ఆధ్వర్యంలో ప్రజా కళామండలి వ్యవస్థాపక సభ్యుడు ఉన్నం నాగేశ్వరరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజల్లో అసమానతలు ఉన్నంత కాలం మావోయిజం ఉంటుందని పేర్కొన్నారు. కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. నాయకులు జోగి కోదండం, కోనేరు రమేశ్, తామాడ త్రిలోచనరావు తదితరులు పాల్గొన్నారు.

దీన్ దయాళ్ ఉపాధ్యాయకు నివాళి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: తన సేవలతో కార్యకర్తల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహోన్నత వ్యక్తి పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని భాజపా జిల్లా కార్యదర్శి వల్లంపాటి కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. జనసంఘ్ సహ వ్యవస్థాపకుడు దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఇచ్ఛాపురంలోని వీకేపీ సమావేశ మందిరంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు ఉపాధ్యాయ జీవిత విశేషాలను వివరించారు.

గానగంధర్వుడికి కళా నీరాజనం

ఇచ్ఛాపురం, కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గానగాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా ఇచ్ఛాపురంలోని వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీలో బుధవారం ఆయన చిత్రపటానికి పలువురు కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాయకుడు వెంకటేశ్వర పట్నాయక్, నాట్య గురువు శృతి ఆధ్వర్యంలో కళాకారులు శాస్త్రీయ నృత్యాలు చేశారు. కంచిలి మండలం జాడుపూడిలో పలువురు కళాకారులు బాలు పాడిన కొన్ని గీతాలను ఆలపించారు. కళాభారతి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిలక సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభం

కంచిలి, కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి గోకర్ణపురం పంచాయతీ పరిధి నారాయణపురంలో బుధవారం జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి పనులను తెదేపా నేతలు ప్రారంభించారు. నాయకులు రామారావు, హరిబాబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల నిరసన

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో ప్రకటించిన నూతన కూలీ ధరలను ఇప్పటివరకు అమలు చేయలేదని పౌర సరఫరాల సంస్థ గోదాంలో పని చేస్తున్న హమాలీలు నిరసన తెలిపారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద బుధవారం నల్ల రిబ్బన్లతో కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలీ ధరలు పెంచి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మండపం నిర్మాణానికి శంకుస్థాపన

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కవిటి మండలం లండారిపుట్టుగ పంచాయతీ పొందూరుపుట్టుగలో బుధవారం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3 లక్షలతో మండపం నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ నర్తు రామారావు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ కడియాల పద్మ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చేయూత

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలం పరిధి ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి రిత్విక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పరామర్శించి రూ.10 వేలు అందజేశారు. ● అదే పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఇంద్రావతి తండ్రి నీలాద్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కలిసి ఆమె కుటుంబ సభ్యులకు రూ.5 వేలు అందజేశారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



ఇచ్ఛాపురంలో హైజంప్ చేస్తున్న బాలుడు

ఇచ్ఛాపురం, పలాస గ్రామీణం, వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణంలోని రాజావారి మైదానంలో బుధవారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు బడులకు చెందిన 263 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈవో కె.అప్పారావు, జోన్-1 వ్యాయామోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు కె.పద్మనాభరెడ్డి పర్యవేక్షించారు. 14, 17 ఏళ్ల విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా వివిధ పోటీలు నిర్వహించారు. విజేతల వివరాలను డీఈవో కార్యాలయానికి తెలియజేస్తామని పద్మనాభరెడ్డి చెప్పారు.

విజేతలకు అభినందన ... పలాస మండలం బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు జిల్లా స్థాయి పాఠశాల పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారని వ్యాయామోపాధ్యాయుడు సీహెచ్‌ఆర్ రామ్‌జీ తెలిపారు. వారిని ప్రధానోపాధాయుడు వీర్రాజు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. శ్రీకాకుళంలో గురువారం పరుగు పందెం, క్రికెట్, శుక్రవారం కబడ్డీ, వాలీబాల్ ఆడనున్నారు. ● వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ఉన్నత పాఠశాలలో ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పాఠశాలల ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు శేఖర్, వ్యాయామోపాధ్యాయురాలు రజని తెలిపారు. వారిని గ్రామస్థులతో కలిసి అభినందించారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



కంచిలి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన ఉపాధ్యాయుడు జె.భగవతిరావును పలువురు సత్కరించారు. ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయుడు ఆర్.కామరాజు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీతారాంనాయుడు, ఎస్ఎంసీ ఛైర్మన్ రమాభీష్మ తదితరులు ఆయన సేవలను కొనియాడారు.
– న్యూస్‌టుడే, కంచిలి

పరిసరాలు శుభ్రం చేశారు

స్పందనకు వందనం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని దినవారీ బజారు మెట్ల వద్ద పరిసరాలను శుభ్రం చేశారు. ఇక్కడ దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకురాగా బుధవారం పురాధికారులు స్పందించారు. పారిశుద్ధ్య విభాగాధికారి పి.ఉపేంద్రకుమార్ సూచనల మేరకు సచివాలయ పారిశుద్ధ్య విభాగ కార్యదర్శి ఉమమహేశ్వరరావు పర్యవేక్షణలో కార్మికులు పనులు చేపట్టారు.

టెక్కలి
•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

ఆసుపత్రికి వితరణ


ప్రభుత్వాసుపత్రి వద్ద సమకూర్చిన బెంచీలు

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి వద్ద రోగులు, బంధువులు కూర్చునేందుకు వీలుగా మార్పు ఈశ్వరమ్మ, ఈశ్వరరావు ఛారిటబుల్ ట్రస్టు బెంచీలను సమకూర్చింది. ట్రస్టు వ్యవస్థాపకులు మార్పు విజయ్ ఆధ్వర్యంలో రూ.40 వేల విలువైన బెంచీలను ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసి బుధవారం ప్రారంభించారు. ఆసుపత్రి ఏవో రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణానికి నిధులు విడుదల చేయాలి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలిలో నూతన కోర్టు భవన సముదాయం నిర్మాణానికి పరిపాలన అనుమతులతో పాటు నిధులు మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. బుధవారం టెక్కలిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం కోర్టును నిర్వహిస్తున్న పాత ఆసుపత్రి భవనం శిథిలస్థితికి చేరడంతో వర్షం కురిస్తే పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారిందన్నారు. అదేవిధంగా టెక్కలిలో సీనియర్ సివిల్‌జడ్జి పోస్టు భర్తీచేయాలని న్యాయశాఖకు విజ్ఞప్తి చేస్తూ సమావేశం తీర్మానించింది. సమావేశంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.దివాకరరావు, న్యాయవాదులు పి.బాబూరావు, పి.సాయిరాజు, ఎం.గోవింద్, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం ఎప్పుడు శాశ్వతం కాదని, ప్రభుత్వాలు మారుతుంటాయన్నారు. శాఖల వారీగా సమీక్షించారు. నగిరికటకం సచివాలయం పరిధిలో 900 ఎకరాలుంటే వ్యవసాయశాఖ అధికారులు 400 బస్తాల యూరియా మాత్రమే ఇచ్చారని, ప్రైవేటు వర్తకులు యూరియా తెచ్చి విక్రయిస్తుంటే వారిని అధికారులు బెదిరిస్తుంటే రైతుకు ఎరువు ఎలా అందుతుందని నగిరికటకం ఎంపీటీసీ సభ్యుడు (మాజీ ఎంపీపీ) బగ్గు రామకృష్ణ సభ దృష్టికి తెచ్చారు. విద్య, వైద్య, గృహ నిర్మాణ, మహిళా, శిశు సంక్షేమశాఖ, పంచాయతీరాజ్, రెవెన్యూ తదితర శాఖలపై సమీక్షించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. • ఎంపీపీ వాన గోపి, నగిరికటకం ఎంపీటీసీ సభ్యుడు (మాజీ ఎంపీపీ) బగ్గు రామకృష్ణ మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఉపాధిహామీ పథకం మెటీయల్ నిధులు రూ.1.95 కోట్లతో 26 పనులకు గాను సభ తీర్మానం కోసం ఎంపీడీవో ఉమామహేశ్వరరావు చదివి వినిపించగా మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ మాట్లాడుతూ అజెండాలో పొందుపరచకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి జీవో ఆలస్యంగా వచ్చిందని అప్పటికే ఎజెండా పూర్తిచేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. తహసీల్దారు జి.లక్ష్మీనారాయణ, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు..
అందక బేజారు..!

• 825 పనులకు 129 మాత్రమే పూర్తి

–న్యూస్‌టుడే, కొత్తూరు, హిరమండలం

గ్రామాల్లో తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇస్తామని, ఇంటింటికీ తాగునీరు అందిస్తామని, ఇందు కోసం ఎన్ని నిధులు ఖర్చు చేయడానికైనా ప్రత్యేక చర్యలు చేపడతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో పేర్కొన్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో అయిదేళ్లలో రెండు విడతల్లో పాతపట్నం నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులు విడుదలయ్యాయి. దీంతో పనులు చేపట్టారు. ఇంకా పూర్తి స్థాయిలో తాగునీరు ఇంటింటికీ అందలేదు. దీంతో గ్రామీణులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

• కొనసాగుతున్నాయ్..: పాతపట్నం నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో జల్‌జీవన్ మిషన్‌లో రూ.177 కోట్ల నిధులను మంజూరు చేశారు. మొదటి, రెండు విడతల్లో కలిపి కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో 825 పనులకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ప్రతిపాదించారు. ఈ మేరకు ఈ నిధులు విడుదల చేశారు. దీనికి 50 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 129 పనులు మాత్రమే పూర్తి చేశారు. దీని కోసం రూ.22.20 కోట్ల నిధులు ఖర్చు చేశారు. అయిదు మండలాల్లో మిగతా 213 గ్రామాల్లో ఇంటింటి కుళాయి పనులు సాగుతూనే ఉన్నాయి. అప్పటి వైకాపా ప్రభుత్వం తమ వాటా నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి పథకం అస్తవ్యస్తంగా మారింది.

మండలాల్లో ఇదీ పరిస్థితి..

• కొత్తూరు: మండలంలోని దొండమానుగూడ, బాంద్రగూడ, చింతమానుగూడ, ముల్లెలగూడ, అంజలిగూడ, టింపటిగూడ, ఆకులతంపర తదితర గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్‌లో చేపట్టిన ఇంటింటి కుళాయి పథకం అలంకారప్రాయమైంది. ఇంటి ముందుకు కుళాయి ఉండటమే తప్ప, తాగునీరు అందడం లేదు.

• హిరమండలం: మండలంలోని కొండరాగోలు, పాత హిరమండలం, రుగడ గ్రామాల్లో కుళాయి ట్యాపులు వేసినా నీరు అందడం లేదు.

• ఎల్ఎన్‌పేట: మండలంలోని గార్లపాడు, యంబరాం, చింతలబడవంజ, మోదుగువలస, ఎస్సీనగర్, తదితర గ్రామాల్లో ఇంటింటి కుళాయిలు వేసినా, తాగునీరు సక్రమంగా అందడం లేదు.

• పాతపట్నం : మండలంలోని పాతపట్నం, అర్చనాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కుళాయిల నుంచి తాగునీరు అందడం లేదు.

• మెళియాపుట్టి మండలంలోని 83 గ్రామాల్లో ఇంటింటి తాగునీటి పథకాన్ని ప్రతిపాదించి, నిధులు విడుదల చేశారు. ఇందులో 13 పనులు మాత్రమే పూర్తయ్యాయి.


కొత్తూరు: దొండమానుగూడలో నీరు రాని కుళాయి

వినియోగంలోకి తీసుకురావాలి

మా గ్రామంలో ఏడాది కిందట ఈ పథకంలో కుళాయిలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి చుక్కనీరు అందలేదు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, తగిన చర్యలు చేపట్టాలి. నీటిని ఇంటికి సరఫరా చేయాలి.

- ఎస్.సురేష్, దొండమానుగూడ గ్రామం, కొత్తూరు మండలం

గుత్తేదారులతో సమీక్షించాం..

ఇంటింటికీ తాగునీరు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. జల్‌జీవన్ మిషన్ పనులపై నియోజకవర్గ స్థాయిలో అధికారులు, గుత్తేదారులతో సమీక్ష చేశాం. ఇంటింటి తాగునీటి పథకంపై సంబంధిత గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, ప్రజల ఇబ్బందులు తీర్చాలి. ఇందులో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించం.

–మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

సృజనాత్మక వికాసానికి రచనలు దోహదం

టెక్కలి, న్యూస్‌టుడే: నూతన రచనలు సృజనాత్మక వికాసానికి దోహదపడతాయని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు అన్నారు. కళాశాల సీఎస్ఈ విభాగం ఆచార్యులు జయంతిరావు, చలపతిరావు, ఆంజనేయులు రచించిన ఎసెన్షియల్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ అండ్ బ్లాక్ చైన్ పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. నూతన పద్ధతులు, అధునాతన పరిజ్ఞానంపై ఇటువంటి రచనలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రచయితలను అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ ఏఎస్ శ్రీనివాసరావు, శ్రీరాములు, వేణుగోపాల్, రమేష్ పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు

నిజాయతీ చాటుకున్న మన గ్రోమోర్ స్టోర్ సిబ్బంది


బంగారు గొలుసును రైతుకు అందిస్తున్న స్టోర్ మేనేజరు గణేష్

టెక్కలి పట్టణం,న్యూస్‌టుడే: టెక్కలి పాత జాతీయ రహదారిపై రవీంద్ర భారతి పాఠశాల పక్కనున్న మన గ్రోమోర్ స్టోర్ సిబ్బంది తమ నిజాయతీని చాటుకున్నారు. నందిగాం మండలం చిన్నతామరాపల్లికి చెందిన రైతు చమళ్లకృష్ణారావు పురుగు మందులు కొనుగోలు చేసేందుకు స్టోర్‌కు వచ్చి కవరుతో పాటు తులంన్నర బంగారు గొలుసు, బ్యాంకు పాసు పుస్తకాలు, ఆధార్ కార్డును మర్చిపోయారు. కాసేపటికి గుర్తించిన స్టోర్ మేనేజరు గణేష్ రైతుకు ఇచ్చిన బిల్లు ఆధారంగా ఫోను చేసి సమాచారం అందించారు. స్టోర్‌కి వచ్చినవారికి బంగారు గొలుసుతో పాటు పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డు అందజేయడంతో సిబ్బంది నిజాయతీని అభినందించారు.

సందడిగా స్వాగతోత్సవం



మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శాంతిహేమ్

నరసన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థుల స్వాగతోత్సవం ఘనంగా జరిగింది. విద్యార్థులు క్రమశిక్షణ అలవరుచుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును అందుకుంటారని కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శాంతి హేమ్ అన్నారు. అధ్యాపకులు రవికుమార్, అన్నాజీరావు, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి

రెండు రాష్ట్రాలను కలిపే పీహెచ్ రహదారి అధ్వానంగా మారింది. కొత్తూరు నుంచి ఒడిశాలోని హడ్డుబంగి వెళ్లే ఇది నివగాం వద్ద రెండు చోట్ల గోతులమయమైంది. రెండు రాష్ట్రాల మధ్య నిత్యం వందలది వాహనాలు తిరిగే చోట బాగోలేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వర్షం కురిస్తే వాహన చోదకులు, ప్రయాణికుల అవస్థలు తప్పడం లేదు. ఈ సమస్యపై ఆర్‌అండ్‌బీ ఏఈ కిరణ్ స్పందిస్తూ రహదారిని మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

–న్యూస్‌టుడే, కొత్తూరు


నివగాం వద్ద పీహెచ్ రహదారి దుస్థితి


మురుగుతో అవస్థలు



నరసన్నపేట మండలం కొత్తపోలవలస పంచాయతీ జల్లువానిపేటలో సిమెంటు రహదారిపై మురుగు నిలిచి గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. రహదారి కన్నా కాలువ ఎత్తులో ఉండటంతో మురుగు రహదారిపై నిత్యం నిలిచి ఉండి నాచు తేలి జారిపడుతున్నామని, రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయమై సర్పంచి పట్ట ప్రభాకరరావు దృష్టికి తీసుకువెళ్లగా రహదారిపై తిరిగి రహదారి నిర్మించేందుకు అవకాశం లేదని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి మురుగు నిల్వ లేకుండా చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

తాగునీరు వృథా



సారవకోట పంచాయతీ కొత్తపేట వీధిలో కుళాయి ట్యాప్‌ లేక నీరు వృథా అవుతోంది. నీటి వృథాను అరికట్టడానికి స్థానికులు కర్రముక్కలను ఏర్పాటు చేసినప్పటికీ ఫలితం అంతంతమాత్రమే. గ్రామంలో కొన్ని వీధులకు పథకం నుంచి నీరందడం లేదు. సరఫరా చేస్తున్న వీధుల్లో కొన్ని ట్యాపులు సరిగ్గా లేకపోవడంతో పరిస్థితి ఏర్పడిందని పలువురు పేర్కొన్నారు. ఈ విషయమై కార్యదర్శి సింహాచలం వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానన్నారు.

–న్యూస్‌టుడే, సారవకోట

అవీ..ఇవీ..అన్నీ

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

హిరమండలం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎం.గోవిందరావు అన్నారు. బుధవారం కొండరాగోలు గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జీవామృతం తయారీ, వరి పైరులో తెగుళ్ల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏడీఏ రాజగోపాల్, శాస్త్రవేత్త చిట్టిబాబు, ఏవో బి సంధ్య, ఉద్యానశాఖ అధికారులు, సర్పంచి ఎం చిన్నయ్య, తెదేపా మండల అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, మండల తెదేపా నాయకులు ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం సబ్ రిజిస్ట్రార్‌గా బి.అరుణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కార్యాలయం పరిధిలోని ఏడు మండలాల ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఎంపీడీవోగా కాళీప్రసాద్



హిరమండలం, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయ అభివృద్ధి అధికారిగా ఆర్.కాళీప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో బి.శైలజకు శ్రీకాకుళం ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ కావడంతో ఈయన ఇక్కడ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

హిరమండలం: తంప జడ్పీ ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులకు కంటి వైద్య నిపుణులు జానకీరామయ్య బుధవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అయిదుగురు విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా మెరుగైన వైద్యం అందజేస్తామన్నారు. 35 మందికి ఉచితంగా మందులు అందజేశారు. హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి అస్వస్థత

సారవకోట: మండలంలోని పద్మాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న చిట్టి ఈశ్వరి బుధవారం పాఠశాల ప్రార్థన సమయంలో అస్వస్థతకు గురైంది. చాలా సేపటి వరకు తిరిగి మెలకువ రాకపోవడంతో హెచ్ఎం గౌరమ్మ, స్థానిక ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తకు సమాచారం అందించారు. అనంతరం వారితో ఆటోలో సారవకోట పీహెచ్‌సీకి తరలించడంతో వైద్య సిబ్బంది వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం నరసన్నపేటకు తరలించారు. ఈమె కొద్ది రోజుల కిందట డెంగీ జ్వరం బారిన పడ్డారని, అప్పటి నుంచి ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు స్థానిక సీఆర్పీ వసంతరావు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీపై ఫిర్యాదు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక అయ్యప్పనగర్‌కు చెందిన సచివాలయ ఉద్యోగి ఎర్ర మనోజ్‌కు చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. మంగళవారం రాత్రి ఇంటి ముందు నిలిపిన వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని బాధితుడు టెక్కలి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల కిందట స్థానిక శ్రీరామ కాలనీకి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి బల్లి రామారావుకు చెందిన ద్విచక్ర వాహనం సైతం చోరీకి గురైంది.

సోలీ బయోసిస్ వ్యాధితో గొర్రెలు మృతి

నందిగాం, న్యూస్‌టుడే: సోలీ బయోసిస్ వ్యాధితో దిమ్మిడిజోల గ్రామానికి చెందిన ఆవలి సూర్యనారాయణ, కృష్ణారావు, తాడేల కృష్ణారావులకు చెందిన సుమారు 60 గొర్రెలు మృతి చెందాయి. మెళియాపుట్టి మండలం తూముకొండ, నందిగాం మండలం దిమ్మిడిజోల గ్రామాల మధ్య ఈ ఘటన జరిగింది.

అనుమతి పత్రాలు లేకుంటే చర్యలు

కొత్తూరు, న్యూస్‌టుడే: అనుమతి పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు చేపడతామని ఎస్సై అహ్మద్ తెలిపారు. స్థానిక శ్రీకాకుళం రహదారి వద్ద బుధవారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమతి పత్రాలు లేకపోయినా, మద్యం తాగి వాహనాలు నడిపినా చర్యలు తీసుకుంటామన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఐసీడీఎస్ సిబ్బంది అన్నారు. చాకిపల్లి-2 అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించి గర్భిణులు, బాలింతలకు ఆవశ్యకతను వివరించారు. పలు కూరగాయలు, పప్పుదినుసులు, చిరుధాన్యాలు, పళ్లు, పిండివంటలతో ప్రదర్శన నిర్వహించారు.

దోషులను శిక్షించాలి

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని టెక్కలి జనసేన ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాన్ దీక్షలకు మద్దతుగా బుధవారం గుంజిలోవ వైభవవేంకటేశ్వరుని ఆలయంలో దీక్షలు చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి పల్లి కోటేశ్వరరావు, నేతలు ఇలపండు రమేష్, గేదెల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.




నరసన్నపేటలో ప్రచారంలో తెదేపా నాయకులు


హిరమండలం: కొండరాగోలులో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ఇతర నాయకులు

సందడిగా ఇది మంచి ప్రభుత్వం

టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం బుధవారం సందడిగా సాగింది. ఆయా ప్రాంతాల్లో తెదేపా, జనసేన ప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, గోడ పత్రికలు అతికించారు. ఆయా చోట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే బృందం


టెక్కలిలోని భూలోకమాత వీధిలో కూటమి నేతలు

జాతర ఏర్పాట్ల పరిశీలన

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మ తల్లి జాతర మహోత్సవాల ఏర్పాట్లను దేవాదాయశాఖ రాజమహేంద్రవరం ఆర్జేసీ కె.సుబ్బారావు బుధవారం సమగ్రంగా పరిశీలించారు. కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఆలయాన్ని బుధవారం సతీ సమేతంగా ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అధికారులు సురేష్‌బాబు, ప్రసాద్ పట్నాయక్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం దేవాదాయ సంప్రదాయ రీతిలో ఆర్జేసీ దంపతులకు ఈవో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలంలో లేఅవుటులో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి డా. ఎం.కరుణాకరరావు కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గృహ నిర్మాణ సంస్థ, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా బేస్మెంటు స్థాయిలో ఉన్న ఇళ్లను 2025 మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. ఆయా అనుబంధ శాఖల అధికారులు గృహ నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడలు


నరసన్నపేట: ఖోఖో ఆడుతున్న బాలికలు

నరసన్నపేట, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: రెండు రోజుల పాటు స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన నియోజకవర్గ స్థాయి పాఠశాల క్రీడలు బుధవారంతో ముగిసాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి 40 పాఠశాలలకు చెందిన 60 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. తొలి రోజున బాలురకు, రెండో రోజు బాలికలకు పోటీలు నిర్వహించారు. వీరిలో 122 మంది బాలురు, 120 మంది బాలికలు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, షటిల్, అథ్లెటిక్స్ తదితర పోటీలు జరిగాయి. పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. పీడీలు ఆనందరావు, ఆర్ రవి, లక్ష్మణరావు, భుజంగరావు, కె.గోపి, రామరాజు తదితరులు పాల్గొన్నారు. • టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఎంపికలు బుధవారం హోరాహోరీగా జరుగుతున్నాయి. 14, 17 ఏళ్ల విభాగంలో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా పోటీల్లో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. 60 పాఠశాలల నుంచి 700 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈవోలు డి.తులసీరావు, డి.చిన్నారావు పోటీలను ప్రారంభించారు.

ప్రతిభ పరీక్షకు స్పందన


చెకుముకి పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

నరసన్నపేట, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్ ప్రతిభ పరీక్షకు మంచి స్పందన చేకూరింది. నరసన్నపేట మండలం నుంచి 21 పాఠశాలలకు చెందిన 2019 మంది విద్యార్థులు, నరసన్నపేట ఉన్నత పాఠశాలలో జరిగిన పరీక్షకు 323 మంది విద్యార్థులు హాజరయ్యారని జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనరు ఎస్.సాయి శ్రీనివాస్ తెలిపారు.

శ్రీముఖలింగేశ్వరుడిని దర్శించుకున్న అధికారులు

జలుమూరు, న్యూస్‌టుడే: శ్రీముఖలింగేశ్వరస్వామిని అస్సాం రాష్ట్రానికి చెందిన రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ శంతను గొట్కారే, ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ రైల్వేశాఖ అధికారి సుహాసిని గొట్కారే దంపతులు బుధవారం దర్శించుకున్నారు. • శ్రీముఖలింగేశ్వరస్వామిని దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆర్జేసి కె.సుబ్బారావు దంపతులు దర్శించుకున్నారు. ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు స్వాగతం పలికారు.

వేడుకలను జయప్రదం చేయండి

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో విజయనగరంలో జరగనున్న ఏపీటీఎఫ్ 80 వసంతాల (ఓక్ జూబ్లీ) వేడుకలతో పాటు జిల్లా విద్యా, వైజ్ఞానిక మహాసభల్లో ఉపాధ్యాయ వర్గాలంతా పాల్గొని జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర్లు కోరారు. లుకులాం ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ ప్రకారం జీవో నంబరు 117ను ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. ఆయనతో పాటు కె.భీమారావు, వేటూరి రవిశర్మ తదితర ఉపాధ్యాయులు ఉన్నారు.


లుకులాంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

నగిరిపెంట రైతులను ముంచిన నకిలీ విత్తనాలు

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం నగిరిపెంట రైతులను నకిలీ విత్తనాలు నిండా ముంచాయి. అధిక దిగుబడి వస్తుందని 1224 విత్తన రకాన్ని అదే గ్రామానికి చెందిన పలువురు రైతులు కోటబొమ్మాళికి చెందిన ఓ వ్యాపారి వద్ద 40 బస్తాలు కొనుగోలు చేశారు. 90 రోజుల్లో పంట చేతికి వస్తుందని ఆశగా ఎదురుచూసిన రైతులకు వరి చేలు కిందకు వాలిపోవడం, పంట రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగిరిపెంట గ్రామానికి చెందిన ముద్దాపు లచ్చన్న, సన్యాసమ్మ, ఆరంగి శోభనబాబు ఖరీఫ్ సీజన్‌లో కోటబొమ్మాళికి చెందిన ఓ వ్యాపారి వద్ద 40 బస్తాల విత్తనాలు కొనుగోలు చేశారు. వాటిని 25 ఎకరాల్లో పంట వేశారు. వరి చేలు ఆశించిన స్థాయిలో పెరగకపోవడం, కిందకు పడిపోవడం, కంకులు రాకపోవడంతో సంబంధిత రైతులు మోసపోయినట్లు గ్రహించి, నకిలీ విత్తనాలు అందజేశారని వ్యాపారిని నిలదీశారు. ఆ విత్తనాలకు, తమకు సంబంధం లేదని, డీలర్లను పిలిపిస్తామని చెప్పి తప్పించుకున్నారు తప్ప న్యాయం చేయలేదని సంబంధిత రైతులు వాపోతున్నారు. 25 ఎకరాల్లో ఈ ఏడాది సాగు చేస్తే ఎకరా పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని, ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు లచ్చన్న, శోభనబాబు, సన్యాసమ్మ తదితరులు కోరుతున్నారు. ఈ విషయమై ఏవో చిరంజీవులును అడగగా ఆయన స్పందిస్తూ తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ఎంపీయూపీ పాఠశాల సందర్శన


హెచ్ఎం, ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఉప విద్యాశాఖ అధికారి విలియమ్స్ ఎంఈవో రాంబాబు

హిరమండలం, న్యూస్‌టుడే: మండలంలోని కోరాడ కాలనీ ఎంపీయూపీ పాఠశాల (సుభలయ ఆర్ఆర్ కాలనీ) జడ్పీ ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించేందుకు (అప్‌గ్రేడ్) టెక్కలి ఉప విద్యాశాఖ అధికారి పి.విలియమ్స్ బుధవారం పరిశీలించారు. ఇటీవల పాఠశాలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, జడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు, ఎంపీపీ టి.మేనకలు పాఠశాలను సందర్శించారు. ఉన్నతీకరణకు చర్యలు తీసుకోవాలని ఎంఈవో కె.రాంబాబును ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ నెల 2న జడ్పీటీసీ సభ్యుడు బుచ్చిబాబు జిల్లా కలెక్టరును కలిసి పదో తరగతి వరకు పాఠశాలను ఉన్నతీకరణ చేయాలని వినతిపత్రం అందజేశారు. దీంతో పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలు పరిశీలించి నివేదిక అందజేయాలని కలెక్టరు డీఈవోను ఆదేశించారు. ఉప విద్యాశాఖ అధికారి పాఠశాలను ఎంఈవో కె రాంబాబుతో కలిసి పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర సాహు, ఉపాధ్యాయులు, సర్పంచి ఎల్.రోజారాణి, చింతాడ బుడ్డు, హేమలతల నుంచి వివరాలు సేకరించారు.

విజయగణపతికి విశేష పూజలు



శ్రీకాకుళం నగరంలోని పాలకొండ రోడ్డు విజయగణపతి ఆలయంలో బుధవారం విజయగణపతికి క్షీరాభిషేకం, విశేష అలంకరణ, స్వర్ణపుష్పార్చన పూజలు నిర్వహించారు. –న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

తెరపై ఈనాడు

● కీర్తన: ఏఆర్ఎం ● కీర్తిక: 100 క్రోర్స్ ● కిన్నెర సినీమాక్స్: 35 చిన్న కథ కాదు ● ఎస్‌వీసీ(రామలక్ష్మణ): సరిపోదా శనివారం ● సూర్యమహల్: మత్తు వదలరా-2 ● సరస్వతి: గొర్రె పురాణం ● చంద్రమహల్: కళింగ ● మారుతి: బొమ్మరిల్లు – న్యూస్‌టుడే, అరసవల్లి

శ్రీకాకుళం

●శ్రీకాకుళం ●ఆమదాలవలస ●ఎచ్చెర్ల

కమ్యూనికేషన్ విభాగంపై చర్చ



జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని నార్త్ రీజియన్ (విశాఖపట్నం) కమ్యూనికేషన్ ఎస్పీ జి.సూర్యకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు కమ్యూనికేషన్ విభాగంపై చర్చించారు. అనంతరం ఎస్పీకు మొక్కను అందించారు.

–న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం,

కూటమి ప్రభుత్వంతో మేలు



ఆమదాలవలస మండలం అక్కివరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

– న్యూస్‌టుడే, బృందం



శ్రీకాకుళం: కొత్తపేటలో గొండు స్వాతితో కలిసి కరపత్రాలు పంపిణీ చేస్తున్న కూటమి శ్రేణులు



జి.సిగడాం: జగన్నాథపురంలో కరపత్రాల ప్రదర్శన

మూగజీవాలతో ఇబ్బందులు

● రాత్రి వేళ రోడ్లపై తిష్ఠ
● పట్టించుకోని పురపాలక యంత్రాంగం



ఆమదాలవలస పట్టణ ప్రధాన రహదారిపై ఆవుల సంచారం

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే

మూగజీవాల సంచారంతో ఆమదాలవలస పట్టణంలో ప్రయాణికులు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కృష్ణాపురం కూడలి నుంచి బ్రిడ్జి డౌన్ వరకూ ప్రధాన రహదారిపై రాత్రి పగలు అనే తేడా లేకుండా పశువులు సంచరిస్తున్నాయి. ఆవులు రోడ్లపై అడ్డుగా రావడంతో అవి పక్కకు వెళ్లే వరకూ కాసేపు ఆగాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. పట్టణ రోడ్లపై ఉన్న చిరు దుకాణాల్లో సామగ్రిని సైతం లాగేస్తుండటంతో వ్యాపారులకూ ఇక్కట్లు తప్పట్లేదు.

వ్యర్థాలు పడేయటంతో..

హోటళ్లలో కూరగాయల వ్యర్థాలను రహదారిపై పడేస్తుండటంతో వాటిని తినేందుకు అలవాటు పడిన మూగజీవాలు రహదారులపై సంచరిస్తున్నాయి. విచ్చలవిడిగా రోడ్లపై తిరుగుతూ ప్రయాణికులు, దుకాణదారులు, వినియోగదారులను ఇబ్బందులు పెడుతున్నాయి. వీటి సంచారంపై పలుమార్లు పురపాలక అధికారులకు ఫిర్యాదు చేసిన ఎవరూ పట్టింపు చేయట్లేదని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మూగజీవాల యజమానులకు తెలియజేసి వాటి సంచారాన్ని నియంత్రించాలని కోరుతున్నారు.

వస్తులు తినేస్తున్నాయి..

దుకాణాల నుంచి కొనుగోలు చేసిన సామగ్రి వాహనాలపై ఉంచి మరో చోటకు వెళ్లి వచ్చేలోగా వాటిని ఆవులు లాగి పడేసి తినేస్తున్నాయి. చాలాసార్లు విలువైన వస్తువులను లాగిపడేశాయి. ఈ విషయంపై పలుమార్లు పుర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవట్లేదు. - బొనెల అప్పారావు, ఆమదాలవలస

చర్యలు చేపడతాం

ప్రధాన రహదారులపై సంచరిస్తున్న మూగజీవాల యజమానులను పిలిపించి వారికి అవగాహన కల్పిస్తాం. అవి రోడ్లపై రాకుండా చర్యలు తీసుకుంటాం.

–పి.బాలజీప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

పిరమిడ్ పుస్తక ప్రదర్శన

శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: నగరంలో బాపూజీ కళామందిరంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ మూమెంట్ సొసైటీ జిల్లాశాఖ, స్పిరిచ్యువల్ టుబెక్కిట్ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహణలో పిరమిడ్ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక శాస్త్ర సేవ, ప్రకృతి విహారం, సత్సంగ సాంగత్యం 'హెల్త్ సెల్ఫ్', రెగ్యులర్ లైఫ్, శాకాహారం, మితాహారం, మౌనం వంటి అంశాల గురించి వివరించే పుస్తకాలను ప్రదర్శనలో పెట్టారు. ధ్యానం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం అని పిరమిడ్ సంస్థ ప్రతినిధులు వివరిస్తున్నారు.



ప్రదర్శనలో ఉంచిన పుస్తకాలు

హమాలీల సమస్యలు పరిష్కరించండి



శ్రీకాకుళంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న హమాలీలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: పౌరసరఫరాల సంస్థలో పని చేస్తున్న హమాలీల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ నేతలు డిమాండు చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లాలోని 14 మండల నిత్యావసర సరకుల గిడ్డంగుల వద్ద బుధవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీమన్నారాయణ యూనియన్ నాయకులు గోవిందరావు, కల్యాణ్ పాల్గొన్నారు.

జగన్ క్షమాపణ చెప్పాల్సిందే

గార, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి మహాపరాధానికి పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాల్సిందేనని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా గార మండలం శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రంలో చంద్రమోహన్ బుధవారం దీక్ష చేపట్టారు.



సంఘీభావ దీక్ష చేస్తున్న పిసిని చంద్రమోహన్, జనసేన నాయకులు

మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరం

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమని ఒకటో పట్టణ ఎస్సై హరికృష్ణ అన్నారు. నగరంలో పలు పాఠశాలల్లో మైనర్ డ్రైవింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికీ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు.

రక్షణ గోడ లేక చిక్కులు



పొందూరు మండలం కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గేటు విరిగి గోడ పడిపోవడంతో పగలు పశువుల బెడదతో సిబ్బంది, రోగులు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆరోగ్య కేంద్రంలో మొక్కల్ని మూగజీవాలు నాశనం చేస్తున్నాయని సిబ్బంది తెలిపారు. సమస్యను ఉన్నతాధికారులకు తీసుకెళ్లామన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పొందూరు, పొందూరు గ్రామీణం

పూడికల తొలగింపు

ఆమదాలవలస పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారిపై మురుగుకాలువల్లో తీసిన పూడికలను సకాలంలో తరలించకపోవడంతో దుర్వాసన వస్తోందన్న స్థానికుల ఇక్కట్లపై బుధవారం ఈనాడులో 'దుర్గంధం భరించలేకున్నాం' అనే శీర్షికతో వచ్చిన సమస్య చిత్రంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలను పొక్లెయిన్‌తో తొలగించారు. ఈ పనులను స్వయంగా పురపాలిక కమిషనర్ పి.బాలాజీప్రసాద్ దగ్గరుండి పర్యవేక్షణ చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం



స్పందనకు వందనం

స్పందించారు..తొలగించారు

సరుబుజ్జిలి మండలం కొమనాపల్లి రహదారిలో గ్రామానికి సమీపంలో విద్యుత్తు స్తంభానికి పచ్చని తీగలు అల్లుకుని పొదలు అల్లుకోవడంపై ఈ నెల 18న 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన 'ఈనాడు'లో సమస్య చిత్రం ప్రచురితమైంది. దీనిపై విద్యుత్తు శాఖ ఏఈ అప్పలనాయుడు స్పందించారు. సిబ్బందిని పంపించి పొదలను తొలగించి సరిచేశారు.

– సరుబుజ్జిలి, న్యూస్‌టుడే



సాంకేతిక పరిజ్ఞానంతో లాభదాయక వ్యవసాయం



డ్రోన్ వినియోగంపై అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల, పొందూరు, న్యూస్‌టుడే: ఖరీఫ్ పంటకాలంలో వరిసాగులో అధునాతన సాంకేతికపరిజ్ఞానం వినియోగంతో లాభదాయక వ్యవసాయం చేయవచ్చని స్థానిక ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. ఎచ్చెర్ల మండలం పొన్నాడలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న యాంత్రీకరణను రైతులు సద్వినియోగం చేసుకొని సాగు ఖర్చు తగ్గించుకోవాలన్నారు. వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమ, కోళ్ల పరిశ్రమ తదితర అనుబంధ రంగాలను కూడా రైతులంతా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ సాగులో డ్రోన్ వినియోగంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించారు. డీడీఏ కె.త్రినాథస్వామి, ఏడీఏ బి.రజని, ఏవో వై.సురేష్, తెదేపా నాయకుడు చౌదరి నారాయణమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు బెండు మల్లేసు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు. వరి పంటకు వచ్చే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి బెండి బాబ్జీ అన్నారు. ★ పొందూరు మండలం తండ్యాం, లక్ష్మీపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.



తండ్యాం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

ఆదిత్యుని సేవలో ప్రముఖులు



దేవాదాయశాఖ ఆర్‌జేసీ సుబ్బారావుకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో రమేష్‌బాబు

శ్రీకాకుళం నగరం, గార, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామిని దేవాదాయశాఖ ఆర్‌జేసీ కె.సుబ్బారావు దంపతులు బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో వేద ఆశీర్వచనాలు, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ఈవో డి.ఎల్.వి.రమేష్‌బాబు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ★ గార మండలం శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రాన్ని దేవాదాయశాఖ ఆర్‌జేసీ కె.సుబ్బారావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ఇన్‌ఛార్జి ఈ.ఓ.గురునాథరావు, ప్రధాన అర్చకుడు చామర్ల సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో వైదిక సిబ్బంది సాదరంగా స్వాగతించారు.

★ అసోం ల్యాండ్ రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ డైరెక్టర్ శాంతాను, సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపాల్ డైరెక్టర్ ఆడిట్ సుహాసిని అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు.

ప్లాస్టిక్ రహిత శ్రీకాకుళమే లక్ష్యం



మార్కెట్‌లో వ్యాపారుల నుంచి నిషిద్ధ ప్లాస్టిక్ చేతి సంచులు స్వాధీనం చేసుకున్న నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: నగర ప్రజలు, వ్యాపారులు నిషిద్ధ ప్లాస్టిక్ చేతి సంచులను వినియోగించరాదని, ప్లాస్టిక్ రహిత శ్రీకాకుళమే లక్ష్యంగా ముందుకెళ్లాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి. ప్రసాదరావు తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో ప్లాస్టిక్‌పై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ★ దేశాన్ని పరిశుభ్రంగా చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు అన్నారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి ఇంద్రపుష్కరిణి పరిసరాలను శుభ్రం చేశారు.

అవీ..ఇవీ..అన్నీ

ఎక్సైజ్ అధికారిగా తిరుపతినాయుడు



పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిగా సీహెచ్ తిరుపతినాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) అబ్కారీశాఖలో విలీనమైన తర్వాత తొలి జిల్లా ఎక్సైజ్ అధికారిగా ఈయన నియమితులయ్యారు. గతంలో ఎస్ఈబీ ఈఎస్‌గా విధులు నిర్వర్తించారు.

ఘనంగా ఫార్మసీ దినోత్సవం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలంలోని శివాని, వేంకటేశ్వర ఫార్మసీ కళాశాలల్లో బుధవారం ప్రపంచ ఫార్మసీ దినోత్సవాన్ని ఘనంగా జరిగింది. కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు చిలకపాలెంలో ఫార్మసిస్టుల ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వేంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డా.బుడుమూరు శ్రీరామమూర్తి, ప్రధానాచార్యులు కె.రాజ్‌కిరణ్, సి.హెచ్.తారకరామరావు, పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొలిపేందుకే చెకుముకి పోటీలు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: నేటి విద్యార్థులను ఆధునిక సాంకేంతిక రంగాల్లో రాణించే విధంగా తయారు చేసి, సమాజంలో ఉన్న మూఢాచారలను తరిమేందుకే చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్ధనరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన ఆధ్వర్యంలో మండల స్థాయిలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు చెకుముకి సైన్సుటాలెంట్ టెస్టు-2024ను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పలరాములు, షణ్ముఖరావు, మోహనరావు పాల్గొన్నారు.



ఇద్దరు హోంగార్డులపై వేటు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో హోంగార్డులుగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరిని కొన్ని రోజుల పాటు విధులకు హాజరుకావద్దంటూ ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. ఒకటో, రెండోపట్టణ పోలీసుస్టేషన్లలో పని చేస్తున్నా ఆ ఇద్దరూ 11 రోజులపాటు విధులకు హాజరుకాకపోవడంతో ఎస్పీ ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఎరువుల యాజమాన్యంపై అవగాహన అవసరం

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: రైతులకు ఎరువుల యాజమాన్యంపై కనీస అవగాహన కలిగి ఉండాలని కృషివిజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డా.భాగ్యలక్ష్మి అన్నారు. కృషివిజ్ఞాన కేంద్రంలో ఆత్మావారి సౌజన్యతో రైతులకు సమగ్ర ఎరువుల యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

పొందూరు ఏపీఎంగా బాధ్యతలు

పొందూరు: మండల వెలుగు ఏపీఎంగా ఆర్.రమణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఎచ్చెర్ల ఏపీఎంగా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై పొందూరు వచ్చారు.

ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరిస్తాం

ఆమదాలవలస గ్రామీణం,న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పర్యటించి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండలం తొటాడ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల, సచివాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

ఎస్పీబీకి స్వరనీరాజనం

శ్రీకాకుళం సాంస్కృతికం: నగరంలోని పాలకొండ రోడ్డు బాపూజీ కళామందిరంలో సిక్కోలు ఫ్యూచర్ సింగర్స్ నిర్వహణలో సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్వరనీరాజనం కార్యక్రమం జరిగింది.

యూత్ క్లబ్ సేవలు అభినందనీయం

పొందూరు, న్యూస్‌టుడే: జిల్లాలో వివిధ మండలాల్లో బెజ్జిపురం యూత్‌క్లబ్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు సంతృప్తికరంగా ఉన్నాయని ఇండియా లిటరసీ ప్రాజెక్టు నాలెడ్జ్ హబ్ మేనేజర్ రవిమణి అన్నారు. తాడివలస ఉన్నత పాఠశాలలో బెజ్జిపురం యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

జి.సిగడాం, న్యూస్‌టుడే: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో పాపినాయుడు అన్నారు. జి.సిగడాం మండలం వాండ్రంగిలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శన చేపట్టారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచి సాకేటి నాగరాజు, మాజీ సర్పంచి బూరాడ వెంకటరమణ, కూటమి నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

జి.సిగడాం: జనసంఘ్ సహ వ్యవస్థాపకుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు జి.సిగడాం మండలం ఆనందపురంలో నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జిపర్తి రఘురాం దీన్‌దయాల్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి గుర్తింపు

తెనాలి టౌన్: గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో మంగళవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కె.తులసీరావు(60)గా గుర్తించినట్లు రైల్వే పోలీసులు బుధవారం తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇతను గత 20 సంవత్సరాలుగా ఒంటరిగా జీవిస్తూ క్యాటరింగ్ సప్లయర్‌గా విజయవాడ, గుంటూరు, తెనాలి ప్రాంతాల్లో పని చేస్తుంటాడని, ఒంటరితనంతో విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నామని వివరించారు.

డిప్యూటీ డీఈవో విచారణ

పొందూరు, న్యూస్‌టుడే: గతంలో పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్య కొట్లాట జరిగి 10వ తరగతి విద్యార్థి చేయి విరిగిన ఘటనపై బుధవారం జిల్లా ఉప విద్యాశాఖాధికారిణి విజయకుమారి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎటువంటి చర్యలు తీసుకోలేదంటూ విద్యార్థి తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాలతో ఈ విచారణ చేపట్టారు. మండల విద్యాశాఖాధికారి రాజారావు, ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

తేనెటీగల దాడిలో వృద్ధుడికి గాయాలు

పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం కనిమెట్ట శివారు చెరువు పక్కన ఉన్న పొలంలో రైతు సింగూరు వాసుదేవరావు తన పని ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో ఒక్కసారిగా చెట్టుపై ఉన్న తేనెటీగలు దాడి చేశాయి. ఆయన కేకలు వేయడంతో స్థానికులు వెంటనే వృద్ధుడిని కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసువచ్చి ప్రథమ చికిత్స అందించారు. వాసుదేవరావు పరిస్థితి బాగానే ఉందని వైద్యాధికారి శివకుమార్ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: దూసి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఇటీవల నాగావళి పరివాహక ప్రాంతాల్లో రాత్రి సమయంలో కొందరు అక్రమంగా ఇసుకను రవాణా చేస్తుండటంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో ఉన్నాతాధికారుల ఆదేశాలు మేరకు పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై తెలిపారు.